క్లుప్తంగా

'దోషులను కఠినంగా శిక్షించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో గల పురాతన శివాలయంలో ఈనెల 25వ తేదీన ఆలయ అర్చకుడు సాయి పూజలు నిర్వహిస్తుండగా దాడికి పాల్పడిన వ్యక్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డీఏఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ, జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలయంలో భక్తుల సమక్షంలో కొందరు విచక్షణారహితంగా దాడిచేయడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ, గిరిజన సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో 2024 –25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న (బ్యాక్‌లాగ్) సీట్ల భర్తీ కోసం ఇచ్చిన గడువును ఈనెల 31 వరకు గడువు పెంచుతున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ పి. బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా దరఖాస్తులు చేసుకోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏప్రిల్ 21 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

'సుధీర్‌ను చంద్రపూర్ ఎంపీగా గెలిపించాలి'



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మహారాష్ట్రలోని చంద్రపూర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి సుధీర్ మునిగంటి వార్‌ను గెలిపించాలని బీజేపీ సీనియర్ నాయకులు బోనగిరి సతీశ్‌బాబు కోరారు. ఏప్రిల్ 19న మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికలు పురస్కరించుకొని బుధవారం సుధీర్ మునిగంటివార్ నామినేషన్ సందర్భంగా జిల్లాలోని బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సుధీర్ మునిగంటివార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుచిత్, స్టేట్ అడ్వకేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజేశ్, సంజీవ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని తుంపల్లి, చిర్రకుంట, కోసార, దాంపూర్, వట్టివాగు కాలనీల్లో విద్యుత్ మరమ్మతులు ఉన్నందున గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఆసిఫాబాద్ రూరల్ విద్యుత్ ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు ఉన్నందున విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

'బహుజన్ ముక్తి' అభ్యర్థిగా రాజు



పార్టీ నాయకులతో బుక్య రాజు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బహుజన్ ముక్తి పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా జిల్లాకు చెందిన బుక్య రాజును ఎంపిక చేసినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ప్రకటించారు.

ప్రధానోపాధ్యాయుడు సస్పెన్షన్

జైనూర్: మండలంలోని పట్నాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తుండగా విద్యార్థినులు అడ్డుకున్న ఘటనలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ పర్శరాంపై సస్పెన్షన్ వేటు పడింది. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డీటీడీవో రమాదేవి మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ పర్శరాంను సస్పెండ్ చేయడంతో పాటు ఏటీడీవో పురుషోత్తంకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. బుధవారం సాయంత్రం వాంకిడి శివారులో గల పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6800 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆటోలకు తగ్గిన ఆదరణ



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు వెంకటేష్, రెబ్బెన మండలం పులికుంట గ్రామం. ఐదేళ్ల క్రితం ఆటో కొనుక్కొని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెబ్బెన పరిధిలోని గ్రామాలతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ వంటి ప్రాంతాలకు ఆటో నడిపిస్తుంటాడు. ఒకప్పుడు రోజంతా నడిపితే రూ. 600 వరకు మిగిలేది. కానీ ప్రస్తుతం ట్రిప్పులు పడక రోజుకు రూ. 200 కూడా మిగలడం లేదని వాపోతున్నాడు. ఇది ఒక్క వెంకటేష్ పరిస్థితే కాదు. ఆటోలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న వేలాది మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి ఇలాగే ఉంది.



రెబ్బెన మండల కేంద్రంలో ఉన్న ఆటోలు

- అగమ్యగోచరంగా ఆటో డ్రైవర్ల బతుకులు
- ఆర్టీసీ బస్సుల్లోనే మహిళల ప్రయాణం
- ఆటోలు ఎక్కేందుకు అనాసక్తి
- ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోవాలాల వేడుకోలు

రెబ్బెన: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణం పుణ్యమా అని ఆటోలకు ఆదరణ తగ్గిపోవడంతో ట్రిప్పులు పడక ఆదాయం గణనీయంగా తగ్గింది. దీంతో ఆటోలపైనే ఆధారపడి జీవిస్తున్న వందలాది మంది డ్రైవర్ల బతుకులకు భరోసా లేకుండా పోయింది.

300లకు పైగా ఆటోలు..

మండలంలోని రెబ్బెన, గోలేటి, గంగాపూర్, నంబాల, నారాయణపూర్ తదితర గ్రామాల్లో సుమారు 300 ఆటోలు ఉన్నాయి. మండల పరిధిలో ఉన్న గ్రామాలతో పాటు బెల్లంపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ వంటి ప్రాంతాలకు ఆటోలను నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. కొన్ని నెలలకు ముందు రోజంతా ఆటో నడిపితే డీజిల్ ఖర్చు పోనూ సుమారు రూ. 600 నుంచి రూ.800 వరకు సంపాదించే వారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకురావడంతో మహిళలు బస్సు ప్రయాణం వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఆటోలకు పూర్తిగా ఆదరణ తగ్గిపోయింది. ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్లలో మహిళా ప్రయాణికులు ఆటోల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రస్తుతం డీజిల్ ఖర్చు పోగా రూ.300లు కూడా మిగలడం లేదని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. దాంతో ఆటోల నిర్వహణ, ఫైనాన్స్ కిస్తీలు, కుటుంబాల పోషణకు సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం సంక్షేమ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది.

ఆటో ఎక్కడం లేదు



రోజంతా కష్టపడి ఆటో నడిపితే కనీసం రూ. 300 కూడా మిగులడం లేదు. ఆటోల్లో మహిళలు అస్సలు ఎక్కడం లేదు. కొంచెం ఆలస్యమైనా వేచి చూసి బస్సుల్లోనే వెళ్తున్నారు.

– రొడ్డ శంకర్, రెబ్బెన

ట్రిప్పులు పడుతలేవు



మహిళలు ఆటోల్లో ఎక్కేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉండటంతో బస్సుల్లోనే వెళ్తున్నారు. దాంతో ట్రిప్పులు పడటం లేదు.

– సతీశ్ జైస్వాల్, రెబ్బెన

ప్రభుత్వంపైనే ఆశలు



ఆటోలు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లకు వెళ్లి ఒక్కోసారి ఖాళీగా వస్తున్నాయి. దీంతో డీజిల్ ఖర్చు మా మీద పడుతుంది. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుంటుందనే ఆశతో ఉన్నాం.

– రాజాగౌడ్, ఆటో యూనియన్ మండల ఉపాధ్యక్షుడు

రాకపోకలకు అంతరాయం



రైల్వేగేటు వద్ద నిలిచిన వాహనాలు

సిర్పూర్(టి): రైల్వేగేటును బొలేరో వాహనం ఢీకొట్టడంతో సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న వేంపల్లి రైల్వేగేటును బుధవారం బొలేరో వాహనం ఢీకొట్టడంతో రైల్వేగేటు విరిగిపోయింది. రైల్వే అధికారులు మరమ్మతులు పూర్తి చేసే వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): పంచాయతీ కార్యదర్శులు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు, గ్రామపంచాయతీల్లో ఉన్న నర్సరీల సంరక్షణ, పీడీఐ డేటా కలెక్షన్, ఉపాధిహామీ కూలీల పనితీరు, కూలీ డబ్బుల చెల్లింపులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వేసవిలో తాగునీటి సమస్యలు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృష్ణమూర్తి, ఏపీవో చంద్రయ్య, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు కల్పించాలి



కౌటాల: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి కూలీలు



కెరమెరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణారావు

కౌటాల: ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని కోరుతూ మండలంలోని తాటిపల్లి గ్రామంలోని ఉపాధిహామీ కూలీలు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఈజీఎస్ ఏపీవో పూర్ణిమకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతుల చేనులకు మట్టిరోడ్డు వేస్తుండగా మాజీ ఎంపీటీసీ రోహినే ఆనంద్‌రావు రోడ్డు వేయకుండా అడ్డుకున్నారన్నారు. మట్టి రోడ్డు వేస్తున్న ఉపాధిహామీ కూలీలపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులే ఉపాధిహామీ పనులు జరగకుండా అడ్డుపడడం సమంజసం కాదన్నారు. కూలీల పై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహారించాలని, ఉపాధి హామీ పనులను అడ్డగించి కూలీలకు పని లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, కూలీలు భరత్, తిరుపతి, దివాకర్, మారుతి, నీతేశ్, వినోద్, రేఖాబాయి, వనిత, సుమన్‌బాయి, పర్వతబాయి, మధురి, గీత తదితరులు పాల్గొన్నారు.

'కూలీల సంఖ్య పెంచండి'

కెరమెరి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామ పంచాయతీలో 100 మంది కూలీలు పని చేయాలని నిబంధన ఉందన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని మెట్టపిప్రి, దేవాపూర్ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎంపీవో అంజద్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, తదితరులు ఉన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

బెల్లంపల్లిరూరల్: పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆకెనపల్లి పశువైద్యాధికారిణి సుజాత అన్నారు. బుధవారం మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యజమానులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వేసవిలో పశువుల దాహార్తి, మేత కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆకెనపల్లి పరిధిలో ఇప్పటి వరకు 550 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. రైతులు పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

పైపులైన్‌ల ధ్వంసంపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీవో గౌరీశంకర్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లిలో మిషన్ భగీరథ పైపులైను ధ్వంసమైన ఘటనలో బుధవారం ఎంపీవో గౌరీశంకర్ విచారణ చేపట్టారు. ఇంటి నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన మల్లేశ్, శంకర్‌లు ఇంటి ప్రహారీ కోసం పునాదులు తవ్వడంతో పైపులైన్లు ధ్వంసమయ్యాయని, దీంతో వారికి నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'టెట్ ఫీజు వెంటనే తగ్గించాలి'



మాట్లాడుతున్న మడావి గణపతి

జైనూర్: నిరుపేద అభ్యర్థులకు టెట్ పరీక్ష ఫీజుల పెంపుతో తలకు మించిన భారమవుతుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన మండల అధ్యక్షుడు మడావి గణపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పరీక్షకు రూ.1000 పెంచడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వం వెంటనే టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నగేశ్, యమున, పుష్పలత, సంగీత, మారుబాయి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండలంలోని వడూర్ శ్రీ సీతారామచంద్రస్వామి రామాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞ హోమం కార్యక్రమాలతో పాటు పూజలు చేశారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు.

తాగునీటి ఎద్దడిపై చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: వేసవిలో నీటి ఎద్దడిని తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అసోదా గ్రామ పంచాయతీ పరిధిలోని పూనగూడ గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జాకీర్ హుస్సేన్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్‌లు సందర్శించారు. వాగు సమీపంలోని బావిలో పూడిక తీసేందుకు ఎంత ఖర్చవుతుందో అంచనా వేశారు. ఇంద్రవెల్లి మండలం తొయిగూడ గ్రామ సమీపం నుంచి పూనగూడ గ్రామానికి మోటార్ బోరు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అయ్యే ఖర్చుపై అంచనా వేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన నీటి ఎద్దడి శాశ్వత పరిష్కరం కోసం కృషి చేస్తున్నామన్నారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి గంగాధర్, గ్రామస్తులు ఉన్నారు.

కంకర లారీలు అడ్డుకొని నిరసన



కంకర లారీలను అడ్డుకుంటున్న స్థానికులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట శివారు ప్రాంతంలో గల కంకర క్వారీల నుంచి నిత్యం కంకర తరలిస్తున్న లారీలను స్థానికులు ముత్తంపేట్ చౌరస్తాలో బుధవారం అడ్డుకొని నిరసన తెలిపారు. కంకర లారీల వల్ల రోడ్డుపై దుమ్ము లేస్తుందని, దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. వారు మాట్లాడుతూ భారీ లారీల్లో పరిమితికి మించి కంకర తరలిస్తుండడంతో తారురోడ్లు ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు. కంకర తరలించే రోడ్డుకు సమీపంలోనే ఇళ్లు ఉండడంతో దుమ్ముతో చిన్నారులకు శ్వాసకోశ వ్యాధులు సోకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొరం రోడ్డుపై దుమ్ము లేవకుండా క్రషర్ల సిబ్బంది ప్రతీరోజు మూడుసార్లు నీళ్లు పట్టాలని డిమాండ్ చేశారు. క్వారీల యజమానులు స్పందించకపోతే కంకర టిప్పర్ల రాకపోకలు పూర్తిగా అడ్డుకుంటామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కార్యకర్తల సమావేశానికి తరలిరావాలి'



బెజ్జూర్: కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్సీ

కౌటాల: కాగజ్‌నగర్‌లో గురువారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు మధ్యాహ్నం 2 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల విస్తృతస్థాయి సమీక్షా సమావేశం ఉంటుందని, సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్పీ అభిమానులు, బీఎస్పీ నాయకులు బీఆర్‌ఎస్‌లో భారీగా చేరనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు నక్క శంకర్, సురేశ్, రాంప్రసాద్, సందీప్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కోరారు. బుధవారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు సామల రాజన్న, రాంప్రసాద్, దేవాజీ, రాజేశ్ తదితరులు ఉన్నారు.

'నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి'

తిర్యాణి: ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని రెబ్బన సీఐ చిట్టిబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిరోధకులుగా మారిన అసాంఘిక శక్తులకు ఎట్టి పరిస్థితుల్లో తమ సహకారం అందించొద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై రమేశ్‌తో పాటు 40 మంది సీఆర్పీఎఫ్ పోలీసులు, 10మంది సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ సాదిక్‌పాషా

చింతలమానెపల్లి: శాంతిభద్రతల రక్షణకు అందరూ సహకరించాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. బుధవారం మండలంలోని లంబాడిహేటి గ్రామంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామంలోని ఆరుగురి వద్ద నాటుసారా పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. తనిఖీలలో ఎస్సైలు నరేశ్, మధుకర్, ఏఎస్సై యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంపీపీ భూమి కబ్జా చేశారు'



మాట్లాడుతున్న పట్టాదార్లు శంకరయ్య, పాపయ్య

చింతలమానెపల్లి: మండల ఎంపీపీ డుబ్బుల నానయ్య తమ భూమిని కబ్జా చేసి, తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు కామ్రె శంకరయ్య, కామ్రె పాపయ్యలు ఆరోపించారు. బుధవారం బాలాజీఅనుకోడ శివారులో విలేకరులతో మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కామ్రె శంకరయ్యకు 65/348 సర్వే నంబర్‌లో 5ఎకరాల భూమి, కామ్రె పాపయ్యకు 65/270 సర్వే నంబర్‌లో 5ఎకరాల భూమి ఉంది. ఈ భూమి వారికి కామ్రె భూమక్క నుంచి వారసత్వంగా సంక్రమించింది. కానీ ఎంపీపీ నానయ్య ఇందులో కొంత భూమి తనదంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని వారు ఆరోపించారు. ఈవిషయంపై ఎంపీపీ నానయ్యను సంప్రదించగా తాను ఎవరి భూమి కబ్జా చేయలేదన్నారు. తన భార్య పేరు మీద ఉన్న ఒక ఎకరం 65 సెంట్ల భూమిలో పంట సాగు చేస్తున్నానని, 15 సంవత్సరాల క్రితం కామెర భూమక్క కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమిని డబ్బులు చెల్లించి తీసుకున్నానని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామ పంచాయతీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ మధుసూధన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టి పలు సూచనలు చేశారు. ముందుగా పంచాయతీలోని రికార్డులను పరిశీలించి గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి అందిస్తున్న వైద్య సేవలను ఆరాతీశారు. అనంతరం గ్రామ నర్సరీని పర్యవేక్షించి మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను తెలుసుకుని వేసవిలో మొక్కల రక్షణకు ఏర్పాటు చేసిన గ్రీన్‌షెడ్ నెట్‌ను పరిశీలించి అన్ని గ్రామాల్లోని నర్సరీలకు గ్రీన్‌షెడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వర్మీ కాంపోస్ట్ షెడ్, వైకుంఠధామాలను సైతం పరిశీలించి నిత్యం వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. అలాగే గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న చెరువు అభివృద్ధి, ఫిష్‌పాండ్, వ్యవసాయ భూ అభివృద్ధి, ఇతర ఈజీఎస్ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పని స్థలాల్లోని కూలీలకు వేసవిలో దాహార్తి బారిన పడకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను స్వయంగా అందజేసి రానున్న రోజుల్లో వేసవి తీవ్రత అత్యధికంగా ఉండే అవకాశం ఉందని ఇందుకు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, సాంకేతిక సహాయకురాలు స్రవంతి ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాహుల్, ఇష్తార్‌లు బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓసియస్ కంప్యూటర్ సహకారంతో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 75695 36323 సంప్రదించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా: 9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్: తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్: కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899